క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మర్రిపాడు : కారు అదుపుతప్పి ముగ్గురికి గాయాలైన ఘటన మండలంలోని డీసీపల్లి టోల్‌ప్లాజాకు సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. నెల్లూరు నుంచి కడపకు వెళ్లే క్రమంలో డ్రైవర్ నిద్రమత్తు కారణంగా కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు.

పోలేరమ్మకు విశేష పూజలు



జలదంకి : జలదంకి పంచాయతీ కమ్మపాళెంలో గ్రామదేవత పోలేరమ్మ తల్లికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని పసుపు, కుంకుమతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొండపనాయుడు ఉభయకర్తగా వ్యవహరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు.

శేషజీవితం హాయిగా గడపాలి



శ్రీనివాసులు దంపతులను సన్మానిస్తున్న అధికారులు

ఆత్మకూరు : పదవీ విరమణ చేసిన వారు శేష జీవితం హాయిగా గడపాలని ఆర్అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.గంగాధర్ అన్నారు. ఆత్మకూరు ఆర్అండ్‌బీలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వై.శ్రీనివాసులు పదవీ విరమణ కార్యక్రమాన్ని నెల్లూరుపాళెం వద్ద ఉన్న ఆ శాఖ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 35 ఏళ్ల పాటు విశేష సేవలు అందించారని గుర్తుచేశారు. అనంతరం శ్రీనివాసులు, పద్మావతి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఈఈ వై.మురళీకృష్ణ, డీఈ మదన్‌మోహన్, డీఈఈ (క్వాలిటీ) శివయ్య, ఏఈలు అనిల్, అన్వేష్, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ వర్ధంతి నేడు

ఆత్మకూరు : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ వద్ద నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటన వెలువడింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొని, వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించాలని కోరారు.

కలిగిరి : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని మండల కేంద్రమైన కలిగిరిలో సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు పాలూరి మాల్యాద్రిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. సేవా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

అన్నవరంలో రక్తదాన శిబిరం

జలదంకి : మండలంలోని అన్నవరం గ్రామంలో కావలి రెడ్‌క్రాస్ సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన 25 మంది రక్తదానం చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించినట్లు జనసేన పట్టణాధ్యక్షుడు సిద్ధూ తెలిపారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ముత్తుకూరురోడ్డు, ఆకుతోటలో ఉన్న లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు భవనంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. రోగులు పెద్ద సంఖ్యలో వైద్యసేవలు పొందారు. విజయవాడ నుంచి వచ్చిన క్లబ్ పూర్వపు గవర్నర్లు గోపినాథ్, దుర్గామల్లేశ్వరరావు పోర్టబుల్ దంత యూనిట్‌ను ప్రారంభించారు. రోగులకు మందులు ఉచితంగా అందచేశారు. క్లబ్ సేవలను కొనియాడారు.

ఉపాధ్యాయులకు సన్మానం

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముందస్తుగా గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు నరసింహమూర్తి, ఎం మాధవి, దేవదాసు, టైలరింగ్ టీచర్ వసుంధర, తదితరులను శాలువాలతో సత్కరించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మారుతీప్రసాద్, చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏటా గురువులను సెప్టెంబర్ మొదటి ఆదివారం సన్మానిస్తున్నామని తెలిపారు. క్లబ్ తరుపున ప్రతి నెలా మొదటి ఆదివారం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కంటి ఆపరేషన్లు సైతం ఉచితంగా చేయిస్తున్నామన్నారు.

నిద్దరోతున్న మూడో కన్ను

- అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు
- పెరిగిన చోరీలు
- పట్టించుకోని పోలీసులు

ప్రస్తుత కాలంలో నేర నియంత్రణతో పాటు నిందితులను వేగంగా పట్టుకోవడంలో సీసీ కెమెరాల పాత్ర చాలా కీలకంగా మారుతున్నాయి. ప్రధాన ఆధారాలు సీసీ కెమెరాల వల్లే లభ్యమవుతున్నాయి. అలాంటి మూడో కన్ను నిర్వహణలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా దొంగతనాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్నాయి.

అల్లూరు : మండల పరిధిలో ఏర్పాటు చేసిన నిఘా కెమెరాలు నిద్దరోతున్నాయి. అల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో దాదాపు 17 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారుల్లో రూ.లక్షలు ఖర్చు చేసి వీటిని అమర్చారు. అయితే నిర్వహణ లేకపోవడంతో అధిక సంఖ్యలో కెమెరాలు అలంకార ప్రాయంగా మారుతున్నాయి.

17లో నాలుగు మాత్రమే

ఏర్పాటు చేసిన 17 సీసీ కెమెరాల్లో ప్రస్తుతం నాలుగు మాత్రమే పనిచేస్తున్నాయంటే పోలీసులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. అల్లూరు నగర పంచాయతీ పరిధిలో కోనేటి సెంటర్, సెటిల్‌మెంట్ సెంటర్, పాత బస్టాండ్ సెంటర్, ట్యాంక్ సెంటర్, రామకృష్ణ కాలేజీ, ఇస్కపల్లి క్రాస్‌రోడ్డు, పోలేరమ్మ టెంపుల్, సింగపేట, నార్త్ మోపూర్ గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో ప్రస్తుతం నాలుగు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలినవి వివిధ కారణాల వల్ల మరమ్మతులకు గురయ్యాయి. వీటి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రధానంగా ఏదైనా దొంగతనాలు లేదా యాక్సిడెంట్లు, గొడవలు జరిగిన సందర్భాల్లో నిందితుల గుర్తింపులో సీసీ కెమెరా ఫుటేజీలు కీలకంగా ఉంటాయి. అయితే అవే పనిచేయకపోవడంతో అనేక కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి.



బస్టాండ్ సెంటర్‌లో పనిచేయని సీసీ కెమెరాలు



రద్దీగా ఉండే రామకృష్ణ కాలేజీ సెంటర్‌లో గతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రస్తుతం తొలగించిన దృశ్యం

పోలీసులకు సవాలు విసురుతున్న దొంగలు

అల్లూరు మండల వ్యాప్తంగా దొంగలు హల్‌చల్ చేస్తూ పోలీసులకు కొత్త సవాళ్లను విసురుతున్నారు. ఇటీవల కాలంలో అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో 20 సవర్ల బంగారం, 80 వేల నగదు, మసీద్ సెంటర్‌లో రూ.2.50 లక్షల విలువగల బైక్, అల్లూరు పేటలో 15 సవర్ల బంగారం, రూ.1.75 లక్షల నగదు, సింగపేట గ్రామంలో 20 సవర్ల బంగారం, రూ.2 లక్షల నగదు చోరీకి గురైంది. ఇలా గత ఆరు నెలల కాలంలో పెద్ద చోరీలు పదికి పైగా జరిగాయి. ఇవే కాకుండా అక్కడక్కడా చిన్న దొంగతనాలు, దారి దోపిడీలు జరిగాయి. ఇవి పోలీస్‌స్టేషన్ వరకు రాలేదు.

మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం



అల్లూరు పోలీస్‌స్టేషన్‌కు ఇటీవల బదిలీపై వచ్చాను. సీసీ కెమెరాలు కొన్ని పనిచేయడం లేదని గుర్తించా. వాటి మరమ్మతులను వీలైనంత త్వరగా చేయిస్తాం. దుకాణాల వద్ద కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల నిందితులను పట్టుకోవడం సులభతరం అవుతుంది. దొంగతనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. రాత్రి సమయాల్లో నిఘాను పెంచుతాం.

– కె.కిశోర్‌బాబు, అల్లూరు ఎస్సై

కల్యాణం కమనీయం



కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

సంగం : మండలంలోని వంగల్లులో కామాక్షిదేవి సమేత భీమేశ్వరస్వామి మహాకుంభాభిషేకం అనంతరం దేవదేవేరుల కల్యాణ మహోత్సవం ఆదివారం కమనీయంగా జరిగింది. ఈ సందర్భంగా కామాక్షిదేవిని వధువుగా, భీమేశ్వరుని వరునిగా అలంకరించిన వేద పండితులు కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. తొలుత వేద పండితులు గణపతి పూజతో కల్యాణ మహోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు జరిపించి కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త పగడాల రఘురామయ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బాల్య వివాహంపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు : పట్టణంలోని ఏసీఎస్సార్ కాలనీకి చెందిన ఓ బాలికకు (13) తల్లిదండ్రులు వివాహం జరపడంపై సాక్షి దినపత్రికలో గత నెల 31న వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై ఐసీడీఎస్ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆత్మకూరు, అనంతసాగరం సీడీపీఓలు సునీలత, పద్మావతి ఆదివారం విచారణ నిర్వహించారు. ఆత్మకూరులో బాలిక తల్లిదండ్రులు లేకపోవడంతో కుటుంబ సభ్యులతో మాట్లాడి మినగల్లు గ్రామంలో వారు ఉన్నట్లు తెలుసుకుని అనంతసాగరం పోలీసులు, పీహెచ్‌సీ వైద్యులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులతో కలిసి బాలిక తల్లిదండ్రులతో మాట్లాడారు. బాల్య వివాహం చేయడం నేరమని, దీనికి కఠిన శిక్ష తప్పదని హెచ్చరించి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలికను పాఠశాలకు పంపి చదువు కొనసాగిస్తామని వారి దగ్గర పత్రం రాయించుకున్నారు. తరచూ తమ సిబ్బంది పర్యవేక్షిస్తుంటారని, బాలిక చదువుకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని అధికారులు తెలిపారు. బాలిక ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేయవద్దని సూచించారు. తల్లిదండ్రులతో పాటు బంధువులతో పత్రాలు రాయించుకుని పోలీస్ అధికారులకు, ఐసీడీఎస్ జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నట్లు సీడీపీఓ తెలిపారు. సూపర్‌వైజర్ రత్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కఠిన శిక్షలతో మహిళలకు రక్షణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మహిళలు

కావలి : రాష్ట్రంలో, దేశంలో మహిళలపై జరుగుతున్న అరాచకాలకు నిరసనగా నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే నినాదంతో ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు ఉద్యమం నిర్వహిస్తామని జమాతే ఇస్లామీ హింద్ కావలి కన్వీనర్ ఫాతిమా మహమ్మద్ తెలిపారు. పట్టణంలోని స్థానిక జర్నలిస్ట్ క్లబ్‌లో ఆమె సంస్థ సభ్యులతో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాలు కఠినమైన శిక్షలు అమలు చేస్తేనే మహిళలకు రక్షణ ఉంటుందన్నారు. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఉద్యమం చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యవర్గ సభ్యులు నూర్జహాన్, షాహినా, హబీబా, ఇస్మత్, షకీలా తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

చేజర్ల : ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేజర్ల మండలం చిత్తలూరు పీహెచ్‌సీ వైద్యుడు ఎ.నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. మూడు రోజులకు మించి జ్వరం, దగ్గు, జలుబు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని ప్రతిఒక్కరూ తాగాలన్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆకుకూరలతో పాటు తగిన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. విటమిన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఆఫ్రాన్ పనుల పరిశీలన

సోమశిల : సోమశిల జలాశయం రక్షణ పనుల్లో జాప్యాన్ని ఉపేక్షించమని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. జలాశయంలో జరుగుతున్న ఆఫ్రాన్ పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమశిల భద్రత, రైతాంగం ప్రయోజనాలే లక్ష్యంగా సాగుతున్నట్లు తెలిపారు.



పైప్‌లైన్‌కు లీకేజీ

కావలి : పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో మున్సిపాలిటీ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి నీరు నేలపాలవుతోంది. ఈ కూడలి మీదుగా నిత్యం అధికారులు, ప్రజా ప్రతినిధులు రాకపోకలు సాగిస్తుంటారు. వారు కూడా పట్టనట్లుగా ఉండిపోతున్నారు. ఫలితంగా నీరు నేలపాలై చిత్తడిగా మారిపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తమ్ముళ్ల దాహానికి చెరువులు గుల్ల

- పెన్నా తీరాన్నీ వదలని టీడీపీ నేతలు
- యథేచ్ఛగా మట్టి, ఇనుక తరలింపు

- సార్.. సార్.. మా గ్రామం నుంచి రేయింబవళ్లు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. దయచేసి ఈ అక్రమ రవాణాను పరిశీలించండి. అని ఓ వ్యక్తి చేజర్ల మండలం నుంచి జిల్లా మైనింగ్ అధికారులకు ఇటీవల తెలిపాడు.
- మా వద్ద ప్రస్తుతం వాహనం అందుబాటులో లేదు. ఇప్పుడు రాలేం. త్వరలో వచ్చి విచారణ చేస్తాం.. అని ఇలా నింపాదిగా సమాధానం చెప్పాడు.
- సార్.. మా గ్రామ చెరువు వద్ద యంత్రాలతో తవ్వి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. వచ్చి పరిశీలించి చర్యలు తీసుకోండి. అని చేజర్ల మండలంలోని మరో వ్యక్తి పోలీస్ అధికారులకు ఫోన్ చేశాడు. అయితే అది సంబంధిత అధికారులు చూసుకుంటారని సమాధానం వచ్చింది.
- ఇలా తెలుగు తమ్ముళ్ల దాష్టీకాలను అధికారుల దృష్టికి వెళ్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.



మట్టిని తవ్వేస్తుండడంతో చెరువులో ఏర్పడిన భారీ గుంతలు

ఆత్మకూరు: టీడీపీ నేతల ధన దాహానికి నియోజకవర్గ పరిధిలోని చెరువులు గుల్లగుల్ల అవుతున్నాయి. వీటితోపాటు పెన్నా తీరాన్ని వదలకుండా యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. ఈ విషయాలు పోలీసులు, రెవెన్యూ అధికారులకు తెలిసే జరుగుతున్నా వారు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విచ్చలవిడిగా తరలింపు

అనంతసాగరం మండలం శంకర్‌నగరం, రేవూరు గ్రామం నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలించి గ్రామ శివార్లలో డంప్ చేసి అక్కడి నుంచి టిప్పర్ల ద్వారా దూర ప్రాంతాలకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. అదేవిధంగా ఆత్మకూరు మండలం బండారుపల్లి, దేపూరు, వాశిలి గ్రామాల నుంచి ఇసుకను దూర ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. ఇవన్నీ తెలుగు తమ్ముళ్ల ఆధ్వర్యంలో విచ్చలవిడిగా జరుగుతోంది. ఇటీవల చేజర్ల మండలంలో టీడీపీకి చెందిన ఇరువర్గాల వారు తామంటే తాము ఇసుక, మట్టి తరలిస్తామని, ఇతర గ్రామాల వారు జోక్యం చేసుకోవద్దని వరుసగా ట్రాక్టర్లను నిలిపి బహిరంగంగా గొడవపడ్డారంటే ఏ స్థాయిలో వారి దాష్టీకం ఉందో తెలుస్తోంది. చెరువుల నుంచి మట్టిని పొలాల మరమ్మతుల పేరుతో అనుమతులు తెచ్చుకుని యథేచ్ఛగా ఇటుక బట్టీల యజమానులకు అమ్ముకుంటూ రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు ఫోన్ల ద్వారా తెలిపినా వారు పట్టించుకోవడం లేదంటూ వారు వాపోతున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు గ్రామాల్లో జరుగుతున్న మట్టి, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మడపల్లి చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

మర్రిపాడు అభివృద్ధికి కృషి

మర్రిపాడు : మర్రిపాడు మండలాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో రూ.2.65 కోట్లతో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన ఆదివారం భూమి పూజ చేశారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన మర్రిపాడు మండలంలో రెండు జాతీయ రహదారులతో పాటు మరో నూతన హైవే, రైల్వే ప్రాజెక్టు, సాగునీటి ప్రాజెక్టులతో మండల ముఖచిత్రం మారనుందన్నారు. ఆత్మకూరు ఆర్డీఓ మధులత, జిల్లా వైద్యాధికారి పెంచలయ్య, డీఎఫ్ఓ చంద్రశేఖర్, జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, నాయకులు పుట్టం బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఆరికట్ల జనార్దన్‌నాయుడు, బాబుయాదవ్ పాల్గొన్నారు.



పీహెచ్‌సీ భవన నిర్మాణానికి భూమిపూజలో మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి

వాటర్ ప్లాంట్ల ప్రారంభం

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన రెండు మినరల్ వాటర్ ప్లాంట్లను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం ప్రారంభించారు.

నేత్రపర్వంగా సత్యసాయి శతజయంతి ఉత్సవాలు

నెల్లూరు(బారకాసు): శ్రీసత్యసాయి సేవా సంస్థలు, ఆంధ్రప్రదేశ్ వేదాధ్యయన విభాగం ఆధ్వర్యంలో నగరంలోని లక్ష్మీపురంలో ఉన్న ఎస్‌బీఎస్ కల్యాణ మండపంలో ఆదివారం సత్యసాయి శత జయంతి ఉత్సవాలను నేత్రపర్వంగా నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ పర్యవేక్షణలో వేకువజామున 5గంటలకు నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం సత్యసాయి చిత్రపటాన్ని పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతికి, లోక కల్యాణార్థం సాయిలింగేశ్వరుడుని అభిషేకించారు. మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు బాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర వేదాధ్యయన సమన్వయ కర్త హరిప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

- ఏపీటీఎఫ్ నిరసన ప్రదర్శన

ఆత్మకూరు : ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్, జీపీఎస్ లాంటివి ఆమోదయోగ్యం కాదని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఆత్మకూరు పట్టణంలో ఆదివారం సీపీఎస్ అమలు అయిన రోజు సెప్టెంబరు 1ని విద్రోహ దినంగా పాటిస్తూ నల్ల రిబ్బన్లతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ పెన్షన్ అనేది భిక్షం కాదని, ఉద్యోగుల హక్కు అని సాక్ష్యాత్తు సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెట్టడం దారుణమన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సీపీఎస్ విధానం ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని చెప్పారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండి సేవ చేసి పదవీ విరమణ అనంతరం సామాజిక, ఆర్థిక భద్రత కలిగించే విధంగా పెన్షన్ విధానాన్ని ప్రభుత్వాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. రాష్ట్ర కౌన్సిలర్ ఆర్.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ 117 జీఓను వెంటనే రద్దు చేయాలని ఖాళీగా ఉన్న వేలాది ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసి విద్యారంగాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా, డివిజన్ కార్యవర్గ సభ్యులు ఆర్.రామసుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఎస్కే సందానీ, పెంచలయ్య, ప్రసాద్‌రెడ్డి, శివరామిరెడ్డి, రత్నారెడ్డి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : నల్లరిబ్బన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట..

కావలి : సీపీఎస్‌ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీపీఎస్‌ను ప్రవేశపెట్టిన సెప్టెంబర్ 1వ తేదీని నిరసన దినంగా పాటిస్తూ, ధర్నా చేస్తున్నామన్నారు. యూపీఎస్‌ను కూడా వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఆ శాఖ సభ్యుడు గురునాథశర్మ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ శాఖ రాష్ట్ర కౌన్సిలర్ గొబ్బిళ్ల కృష్ణయ్య, కటారి నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షుడు రామారావు, సభ్యులు రఘునాథరెడ్డి, రఘునాథరావు, బూచి మధుసూదన్‌రావు, జి.సంజీవ్‌కుమార్, రమణకుమార్, జగన్, రత్నం, శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కావలి : నిరసన ప్రదర్శన చేస్తున్న ఏపీటీఎఫ్ సభ్యులు